కఠిన చట్టాలతోనే వైద్యులపై దాడులకు అడ్డుకట్ట



కోల్‌కతా హత్యాచార ఘటన దారుణం. చట్టాలు బలహీనంగా ఉండడంతోనే వైద్యులపై తరచుగా దాడులు జరుగుతున్నాయి. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి హత్యాచార దోషికి ఉరి శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల ప్రాంగణంలో వైద్యులు సిబ్బందిపై దాడులు జరగకుండా చట్టాలను కఠినతరం చేయాలి. ఆసుపత్రులలోకి రోగులు వెంటే వచ్చే బంధువులను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. రోగి పరిస్థితి మేరకు అనుమతులు ఇవ్వాలి. విచ్చలవిడిగా సందర్శకులను అనుమతించకపోవడం మేలు. మద్యం సేవించి ఆసుపత్రులకి వచ్చేవారిని కట్టడి చేయాలి. ఇలాంటి విషయాల్లో కఠినంగా నిర్ణయాలు తీసుకుంటే అన్నివిధాలుగా మేలు జరుగుతుంది.

– డాక్టర్ మొల్లా జబీన్

ఆసుపత్రులలో భద్రత పెంచాలి



కోల్‌కతాలో జరిగిన హత్యచార ఘటన తీవ్ర అమానుషం. మహిళ డాక్టర్ల పై జరుగుతున్న అఘాయిత్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆసుపత్రుల్లో పర్యవేక్షణ లోపంతో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఆసుపత్రికి వచ్చే వారిని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు వారి యొక్క సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేస్తే బాగుంటుంది. ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటే పునరావృతం కావు. అలాగే రాత్రి వేళలో విధులు నిర్వహించే వైద్యురాళ్లకు రెస్ట్ రూములను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వాలు స్పందించి డాక్టర్లకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, చట్టాలను కఠినతరం చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ సుజాత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తలముడిపి

క్లుప్తంగా

వడ్లోని వంకను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



వంకను పరిశీలిస్తున్న నాగరాజు

కల్లూరు: మండల పరిధిలోని పెద్దపాడు వడ్లోని వంకను ఇరిగేషన్ జేఈ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. వడ్లో వంక అన్యాక్రాంతమైందని, వంకను పూడ్చి ప్లాట్లు వేయడం ద్వారా వర్షంనీరు ఎస్సీ కాలనీ, ఎస్సీ హాస్టల్‌లోకి వస్తున్నాయని సీపీఎం నాయకులు సోమవారం జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు వంకను పరిశీలించి రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు నివేదికను ఇస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, మండల కార్యదర్శి మధు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న యోగేశ్వర్‌రెడ్డి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి యోగేశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. రిజిస్ట్రార్ తేజోవతి సమక్షంలో రికార్డుల రూమ్‌లను పరిశీలించారు. రికార్డుల భద్రతగా ఉన్నాయా, ఎలాంటి ప్రదేశంలో ఉన్నాయనే విషయాలను ఆరా తీశారు. లాంటి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం(ఫిజిక్స్) బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువయ్యశెట్టి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టుగాడ్యుయేషన్‌లో 50శాతం ఉత్తీర్ణత కలిగి, కనీసం రెండేళ్ల అనుభవం అభ్యర్థులు అర్హులన్నారు. 27వ తేదీలలో సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

ఘనంగా పీర్ల సరిగెత్తు



హిమాంసాహెబ్ పీరును ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో పీర్ల సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. మొహర్రం పండుగ ముగిసిన 40 రోజుల జార్తల లో భాగంగా గురువారం హిమాంసాహెబ్ పీరుస్వామిని కొలువంచారు. స్థానిక గజ్జల మాధవస్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వాములవారిని పూలదట్టీలతో ముస్తాబు చేశారు. భక్తులు స్వాముల వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు.

నదితీర గ్రామాల్లో పర్యటించిన తహసీల్దార్



ఈర్లదిన్నె నదితీరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయశ్రీ

సి.బెళగల్: సి.బెళగల్ మండలంలోని తుంగభద్ర నదితీర గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ విజయశ్రీ పర్యటించారు. పల్‌దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, కె.సింగవరం, కొత్తకోట గ్రామాలను సందర్శించి నదిలో నీటి ప్రవాహంను పరిశీలించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో గతంలో నిర్వహించిన ఇసుకరీచ్ ప్రాంతాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. ఆమె వెంట వీఆర్వోలు గౌరీ, శ్రీనివాసులు, వీఆర్‌ఏలు ఉన్నారు.

టంగుటూరి జయంతి

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి, ఏపీఓ విజయరాణి, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలను ఈ సందర్భంగా ఎంపీపీ గుర్తు చేశారు.

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం దివంగత ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి తహసీల్దార్ విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్ గురునాథ్, వీఆర్వోలు ఇందిరమ్మ, సామన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పొలం ఉన్నా... లేనట్లే!

- ఆలమూరు రైతుల దుస్థితి
- ఎస్సార్బీసీకి గండ్లు కొడుతున్న దుండగులు
- చెరువు అలుగు నుంచి నిత్యం పారుతున్న నీరు.. ఏళ్లుగా పొలాలు బీళ్లు
- 300 ఎకరాలు నిత్యం జలమయం.. సాగు మానేసిన రైతాంగం





చీడపాయ వాగుపై ఉన్న ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలకు గండి కొట్టిన దుండగులు, కొర్దపాయ వాగుపై గండి దృశ్యం

పాణ్యం: పొలం ఉన్నా... లేనట్లే అన్నట్టుగా ఉంది మండల పరిధిలోని ఆలమూరు రైతుల దుస్థితి. ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వకు కొందరు దుండగులు గండ్లు పెట్టడంతో దిగువన ఉన్న భూమికి నీరు అధికమై సాగు మానేసిని పరిస్థితి నెలకొంది. దీంతో పొలాలు బీళ్లుగా మారాయి. ఎస్సార్‌బీసీతో అందరికి మేలు జరుగుతుంటే మాకు మాత్రం కొందరు స్వార్థపరులు మూలంగా కీడు జరుగుతోందని ఆలమూరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భాధిత రైతుల్లో దళితులు, బీసీల రైతులే అధికంగా ఉన్నారు. కొన్నేళ్లుగా రైతులు చేస్తున్న పోరాటాలు అన్నీఇన్నీ కావు. కాల్వలకు గండ్లు పూడ్చాలని రైతులు పదేపదే ఎస్సార్‌బీసీ అధికారులకు వినతులు సమర్పించినా ఏ మాత్రం ప్రయోజనం చేకూరడం లేదు. 300ఎకరాలకుపైగా పొలాలు సాగుకు పనికిరాకుండా పోయింది. ప్రధాన క్యాల సుమారు నాలుగు గండ్లను దుండగులు కొట్టారు. ఈ గండ్ల నుంచి వచ్చే నీరు వలన వాగులు ఉప్పొంగి పోర్లుతాయి. ఈ క్రమంలో చిన్నపాటి వాగులు కూడా నిండిపోయి పొలాల్లో ప్రవహించడంతో పొలాలు బీళ్లుగా మారిపోయాయి. దీంతో రైతులు చేసేదేమి లేక..సాగు చేసుకోలేక ..అలాగే పొలాలను వదిలేశారు.

స్వార్థ ప్రయోజనాలకోసం ఎస్సార్‌బీసీకి గండ్లు

ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వకు ఆలమూరు గ్రామం వద్ద నాలుగు గండ్లను దుండగులు కొట్టారు. ఆ దుండగులు అటవీశాఖ పరిధిలో కొండపై మట్టిని పోసి పొలాలను సాగు చేసుకుంటున్నారు. ఈ పొలాలకు నీటి కోసం ఇష్టమొచ్చిట్లు ప్రధాన కాల్వకు ఎక్కడపడితే అక్కడ గండ్లు కొట్టారు. కాల్వలకు నీరు విడుదల చేసినప్పుడల్లా(ఖరీఫ్, రబీ) నాలుగు గండ్ల నుంచి వచ్చే నీరు ఎకమై ఆలమూరు చెరువులోకి చేరుతున్నాయి. అలుగు ద్వారా దిగువన ఉన్న పొలాలో నీరు 24గంటలు ప్రవహిస్తుంది. కేవలం కొందరి దుండగులు కారణంగా దిగువన ఉన్న రైతులకు అధిక నీరు వలన శాపంగా మారాయి. సాగు విషయం అటుంచి తమ పొలం ఎక్కడ ఉందనే విషయం అర్థమవ్వని పరిస్థితి నెలకొంది.

అధికారులకు వినతులు సమర్పించినా ప్రయోజనం శూన్యం

దుండగుల మూలంగా తమ పొలాలు సాగు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆలమూరు బాధిత రైతులు అధికారులకు పలుమార్లు వినతులు సమర్పించిన ప్రయోజనం శూన్యంగా మారింది. వినతులు సమర్పించినప్పుడు అధికారులు రావడం ... పొలాలను చూడడం.. సానుభూతి తెలుపడం తప్పా పరిష్కార మార్గం చూపడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్‌బీసీ బ్లాక్, చెరువు ద్వారా మా గ్రామానికి సాగునీరు పుష్కలంగా ఉందని రైతులు చెబుతున్నారు. కొందరు అక్రమార్కుల స్వార్థంతో తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి నాలుగు గండ్లను పూర్తిగా కాంక్రీట్‌తో పూడ్చాలని కోరుతున్నారు బాధిత రైతులు.



నేటికి కాల్వ కింద వాగులో ప్రవహిస్తున్న నీరు



ఆలమూరులో బీళ్లుగా మారిన పొలాలు

పొలంలో కంపచెట్లు పెరిగాయి



నాకు ఎనిమిదెకరాల పొలం ఉంది. పదేళ్లుగా పొలం బీడుగా మారింది. పొలంలో వీపరితమై నీరు ప్రవహిస్తుంది. మూడు అడుగులపైనే నీటి ప్రవాహం ఉంది. మా పొలాల హద్దులు ఎక్కడున్నాయనే విషయం అర్థం కావడం లేదు. పొలాలు మొత్తం కంపచెట్లు, గడ్డితో నిండిపోయాయి. కాల్వలకు గండ్లు పూడ్చాలని అధికారుల చుట్టూ ప్రదక్షిణులు చేస్తూనే ఉన్నాం. వందల సంఖ్యలో అర్జీలు సమర్పించినా స్పందన లేదు. ఇప్పటికైన అధికారులు చొరవ తీసుకుని గండ్లు పూడ్చితే వచ్చే ఖరీఫ్‌లో సాగు చేసుకుంటాం.

– నగినెల సుబ్బరాయుడు, ఆలమూరు రైతు

చర్యలు తీసుకుంటాం

సమస్యను ఆలమూరు రైతులు మా దృష్టికి తెచ్చారు. పరిష్కారం కోసం డీఈఈ స్థాయి అధికారి క్షేత్ర స్థాయిలో సమస్యను గుర్తించారు. కాల్వకు నీరు పూర్తిగా తగ్గిస్తే గండ్లు పూడ్చిరైతులు ఇబ్బంది లేకుండా చూస్తాం. పదేపదే గండ్లు కొడుతున్న దండుగులపై చర్యలు తీసుకుంటాం. ఏ రైతుకు ఇబ్బంది లేకుండా సాగు నీరు వృథా కాకుండా చూస్తాం. బాధిత రైతులకు న్యాయం చేస్తాం.

-కిష్టన్న,ఈఈ

వైద్యురాలి హత్యాచార ఘటనపై నిరసన



మానవహారంగా నిరసన తెలుపుతున్న దృశ్యం

పాణ్యం: కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనను ఖండిస్తూ శుక్రవారం మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఫార్మసీ విద్యార్థులు నిరసన తెలిపారు. ప్రిన్సిపాల్ మధుసూధనోట్టి ఆధ్వర్యంలో విద్యార్థినులు, నల్లబ్యాడ్జీలు ధరించి కళాశాల ఆవరణలో కొవ్వొత్తుతో ర్యాలీ చేపట్టారు. కళాశాల ప్రాంగణంలో మానవహారంగా ఏర్పడి జూనియర్ వైద్యురాలికి ఆత్మకుశాంతి చేకురాలని ప్రార్థించారు. లాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.

లద్దగిరి హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీఓ



మౌలిక వసతులపై వార్డెన్ శ్రీనివాసులుతో చర్చిస్తున్న ఆర్డీఓ శేషిరెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి 1,2 బీసీ వెల్ఫేర్ హాస్టళ్లను శుక్రవారం కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హాస్టళ్లలో మౌలిక వసతులు, విద్యార్థుల సమస్యలపై వార్డెన్ శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. గదులను పరిశీలించడంతో పాటు సౌకర్యాలపై ఆర్డీఓ ఆరా తీశారు. నీటి సమస్య, గదులు, బాత్ రూమ్‌ల సమస్య ప్రధానంగా ఉందని, వంట గదికి కొత్త షెడ్ నిర్మించాలని వార్డెన్ శ్రీనివాసులు ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ వెంకటేష్ నాయక్ ఉన్నారు.

అమడగుంట్ల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీఓ

మండలంలోని అమడగుంట్ల బీసీ బాలుర హాస్టల్‌ను కోడుమూరు ఎంపీడీఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విద్యార్థులు, వార్డెన్‌తో సమస్యలపై చర్చించారు. హాస్టల్లో కల్పించాల్సిన వసతుల వివరాలను సేకరించారు.

ఈ-పంట నమోదు పూర్తిచేయండి



ఆముదం పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఓర్వకల్లు: ఈ-పంట నమోదు ప్రక్రియను సెప్టెంబర్ 15వ తేదీలోపు పూర్తిచేయాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఏడీఏ శాలురెడ్డి ఆదేశించారు. క్షేత్రస్థాయి పంటల పరిశీలనలో భాగంగా ఆయన మండల కేంద్రం ఓర్వకల్లు రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఏ శాలురెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 5455 ఎకరాలలో పంటలు సాగుచేసినట్లు తెలిపారు. అనంతరం రైతులు సాగు చేసిన మొక్కజొన్న, పత్తి, ఆముదం పంటలను పరిశీలించారు. ఆయా పంటలను ఆశించిన పురుగులు, తెగుళ్ల గురించి వివరించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు ఫెరమంట్రాకులను పొలంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సుధాకర్, ఏఈఓ భాస్కర్, రైతు సేవా కేంద్రాల సిబ్బంధి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సి.బెళగల్ బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీడీ శ్యామల

సి.బెళగల్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. మండల కేంద్రం సి.బెళగల్లోని బీసీ హాస్టల్‌ను శుక్రవారం ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్‌లతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీడీ శ్యామల హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం హాస్టల్ పరిసరాలు, విద్యార్థుల గదులు, వంటగది, వంట పదార్థాలను పరిశీలించారు. ఆహార పదార్థాల రుచి చూసిన అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. హాస్టల్‌కు ప్రహరీ, అదనపు గదులు, బోర్ వెల్ ఏర్పాటు చేయాలని అధికారులను విద్యార్థులు కోరారు.

సర్పంచ్‌లు లేకుండానే గ్రామ సభలు!



కంబదహాల్‌లో సభలో సర్పంచ్ చిన్న ఈరమ్మను వెనుకలైన్‌లో కూర్చోబెట్టిన దృశ్యం

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభలలో విమర్శలు వెల్లువెత్తాయి. కొన్ని గ్రామాలలో సర్పంచ్‌లు లేకుండానే సభలను అధికారులు పూర్తి చేశారు. గ్రామ సభలు సర్పంచ్‌ల అధ్యక్షతన జరగాల్సి ఉన్నప్పటికీ పంచాయతీల ప్రత్యేక అధికారులు అలా కానిచ్చేశారు. సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో జరిగిన గ్రామ సభకు సర్పంచ్ దస్తగిరి హాజరు అవాల్సి ఉండగా, పంచాయతీ ప్రత్యేక అధికారిణిగా ఉన్న తహసీల్దార్ విజయశ్రీ సభను నిర్వహించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ దస్తగిరి సభను ముగించే సమయంలో వచ్చి, అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అదేవిధంగా ముడుమాల సర్పంచ్ బతుకమ్మ, గుండ్రేవుల సర్పంచ్ మాధవి గ్రామ సభలకు రాకుండానే అధికారులు కార్యక్రమం పూర్తి చేశారు. కాగా కంబదహాల్ గ్రామంలో గ్రామ సభకు హాజరైన సర్పంచ్ చిన్న ఈరమ్మను వెనుక లైన్‌లో కూర్చబెట్టారు.

ఓర్వకల్లు: ఉపాధి హామీ నిధులతో గ్రామాలను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం నన్నూరు గ్రామంలో సర్పంచ్ బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పాల్గొని ప్రసంగించారు. మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామ సభలో గందరగోళం నెలకొంది. స్థానిక 6వ వార్డు సభ్యులు చేట్ల సత్యవేణికి సమాచారం ఇవ్వకపోవడంతో సత్యవేణి భర్త సతీష్, రాజు, సంజీవ తదితరులు వేదక వద్దకు దూసుకెళ్లారు. అందరికీ సమాచారం ఇచ్చి తమకెందుకు సమాచారం ఇవ్వరని అధికారులను నిలదీశారు.

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో అధికారులు నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలలో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. సీసీ రోడ్లు, మురుగు నీటి కాల్వలు నిర్మించాలని, నీటి సమస్య పరిష్కరించాలంటూ ప్రజలు పెద్ద ఎత్తున ఆయా గ్రామ సభల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

గడివేముల: గ్రామాల్లో రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని గ్రామ సభలో ప్రజలు కోరారు. శుక్రవారం మండల వ్యాప్తంగా జరిగిన గ్రామసభలు సాదాసీదాగా జరిగాయి. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ విద్యాసాగర్ గ్రామ సభలను పరిశీలించారు. బొల్లవరం పాఠశాలకు కాంపౌండ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని హెచ్‌ఎం నరసింహులు వినతి పత్రం అందజేశారు.

కులధ్రువీకరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

- జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య



గూడూరులో ప్రజలతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య

కోడుమూరు రూరల్: ప్రజలకు ఇచ్చే కులధ్రువీకరణ పత్రాల్లో ఎలాంటి పొరపాట్లకు తావుండరాదని జాయింట్ కలెక్టర్ నవ్య అధికారులను ఆదేశించారు. మండలంలోని పెంచికలపాడు, గూడూరు పట్టణంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ నవ్య పర్యటించారు. సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే కులధృవీకరణ పత్రాలను ఏ విధంగా వెరిఫికేషన్ చేయాలి అన్న అంశంపై ఆరా తీశారు. జేసీ స్వయంగా అధికారులతో కలిసి సంజీవయ్యనగర్‌లో పర్యటించి ప్రజలతో మాట్లాడి కుల ధ్రువీకరణ పత్రాలపై అవగాహన కల్పించారు. కులధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, అర్జీదారుని వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. అన్ని విషయాలు స్పష్టంగా తెలుసుకున్నాకే కులధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని తహసీల్దార్ రామాంజినేయులు, రెవెన్యూ సిబ్బందిని జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ రవికుమార్‌పాల్గొన్నారు.

చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు

గడివేముల: తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని గడివేముల ఎస్‌ఐ నాగర్జున రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని బూజునూరు బాట వద్ద శుక్రవారం ఎస్‌ఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన రికార్డులు లేని వాహనచోదకులకు అపరాధ రుసుము విధించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్ప వన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏఓ



మంచాలకట్టలో మొక్కజొన్న పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ హేమ సుందర్ రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామంలో సాగైన మొక్కజొన్న పంటను శుక్రవారం ఏఓ హేమసుందర్ రెడ్డి పరిశీలించారు. సాక్షి దినపత్రికలో ప్రచురించిన 'ముంచిన మొక్కజొన్న విత్తనాలు' కథనానికి స్పందించిన వ్యవసాయ అధికారులు మంచాలకట్ట గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రంగస్వామి పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. విత్తనాలు ఎక్కడ కొనుగోలు చేశారు.. బిల్లులు తీసుకున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ మేరకు బాధిత రైతుల నుంచి విత్తనాల కొనుగోలుకు సంబంధిచిన బిల్లులను ఏఓ సేకరించారు. మొక్కజొన్న పంట తీరును, విత్తనాల బిల్లుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా ఏఓ హెమసుందర్‌రెడ్డి చెప్పారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితా

పాణ్యం: గ్రామాల అభివృద్ధి లక్ష్యమని ఎమ్మెల్యే గౌరు చరితా అన్నారు. పాణ్యం సర్పంచ్ మేకల పల్లవి అధ్యక్షతన శుక్రవారం వీరనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఓ మంజువాణి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి, తహీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి సంబంధించిన పనుల తీర్మానాలు చేశారు. ఉలిందకొండ గ్రామంలో సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సెట్కూరు సీఈఓ రమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓ మద్దేశ్వరమ్మ, టీడీపీ నాయకులు ఈవి రమణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

గడివేముల: మండల పరిధిలోని మంచాలకట్ట గ్రామ సమీపంలో ఉన్న ఎస్‌ఆర్‌బీసీ కాలువలో ఈ నెల 19 దూకిన ఉప్పరి కృష్ణమూర్తి (35) మృతదేహం గోరుకల్లు రిజర్వాయర్‌లో లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.